క్లుప్తంగా

పచ్చిరొట్ట ఎరువులు మంజూరు

కాశినాయన : 50 శాతం సబ్సిడీతో మండలానికి పచ్చిరొట్ట ఎరువులు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 70 క్వింటాళ్ల జీలగలు, 30 క్వింటాళ్ల జనుములు, 2 క్వింటాళ్ల పిల్లిపెసర మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. సబ్సిడీ పోను 10 కిలోల జీలగల ప్యాకెట్ రూ.440, అలాగే సబ్సిడీ పోను 10 కిలోల జనుముల ప్యాకెట్ రూ.440, పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ రూ.536 రైతు వాటాగా చెల్లించాలన్నారు. కావాల్సిన రైతులు సోమవారం తమ దగ్గరలోని రైతుభరోసా కేంద్రానికి ఆధార్‌కార్డు, మొబైల్ తీసుకుని వెళితే వీఏఏలు బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించవద్దు


మాట్లాడుతున్న ఎస్‌ఐ జయరాములు

బి.కోడూరు : ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని ఎస్‌ఐ జయరాములు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బి.కోడూరు పోలీసుస్టేషన్ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ స్నేహభావంతో మెలగాలని, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించరాదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు


వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ విక్రమసింహ, ఎస్‌ఐ కె.సి.రాజు

అట్లూరు : జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ముగిసే వరకు ఎలాంటి సమస్యలు సృష్టించి సమస్యల్లో ఇరుక్కోకూడదని, ప్రతి ఒక్కరు శాంతియుతంగా నడుచుకోవాలని బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, స్థానిక ఎస్‌ఐ కె.సి.రాజులు పేర్కొన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం మండల పరిధిలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈరోజు వివిధ పార్టీల నాయకులతో సమావేశం కావడం జరిగిందని, రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్ల దృష్ట్యా గుర్తెరిగి ప్రతిఒక్కరు ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని తెలిపారు. గొడవలకు పాల్పడే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడంతోపాటు పీడీ యాక్ట్ ఉపయోగించడం జరుగుతుందని పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ శశిభూషణ్‌రెడ్డి

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ సేవలు అందించాలని, ఆసుపత్రిలో డెలివరీలు పెంచాలని సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి బుధవారం, శనివారం వ్యాధినిరోధక టీకాలు వేయాలని, ఉదయం 7 గంటల నుంచి 7–30 గంటలలోపు వ్యాక్సిన్ తీసుకుపోవాలని, మధ్యాహ్నం 2 గంటలకు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ప్రతి గురువారం ఐరన్ మాత్రలు అందించాలని, వివాహ వయస్సుపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ బీపీని చెక్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ నారాయణ, డీఎస్ఓ హరి, ఎంఐఎస్ రాజశేఖర్, ఎంపీహెచ్ఈఓ వెంకటరత్నం, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవం.. ఆరాధనోత్సవం



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, ఆయన మనువరాలు శ్రీ ఈశ్వరీదేవి ఉత్సవమూర్తుల ఊరేగింపు, శ్రీ ఈశ్వరీదేవిమఠంలో భారీగా భక్తజనం

- చిన్నమఠంలో జేజినాయన ఉత్సవాలు
- భారీగా పాల్గొన్న భక్తజనం

బ్రహ్మంగారిమఠం : కందిమల్లాయపల్లెలోని జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ విశ్వకర్మ పరమేశ్వరులు, శ్రీ ఈశ్వరీదేవికి పంచామృతాభిషేకాలు, బిల్వదళార్చన పూజలు చేశారు. అనంతరం జరిగిన గుడి ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. ప్రకాశం జిల్లా చీరాలపేరాలకు చెందిన తుర్లపాటి సాంబశివరావు, పద్మావతి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్ప, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం భక్తగాన లహరి, వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. రాత్రి సింహ వాహనంపై శ్రీ ఈశ్వరీదేవి ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. వాసుదేవాపురానికి చెందిన మూలింటి చిన్న నాగిరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఆదిబ్రహ్మయ్యాచారి, కె.నాగభూషణచారి, కె.నాగవీరాచారి, కె.జనార్దనాచారి, హిందుపురానికి చెందిన కె.క్రిష్ణమాచారి, ధర్మవరానికి చెందిన యస్.శంకరాచారి సహకారంతో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పెద్ద మఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న తర్వాత భక్తులు.. స్వామి మనువరాలైన శ్రీఈశ్వరీదేవిని చిన్నమఠంలో దర్శించుకుని తరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేపట్టారు.


అచలానందస్వామి ఆశ్రమంలో..

బ్రహ్మంగారిమఠం మండల పరిధి తోట్లపల్లిలోని అచలానందస్వామి ఆశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ, కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 14 నుంచి 19 వరకు ఆరు రోజులపాటు ఉత్సవాలు చేపడుతున్నారు. శుక్రవారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు, విశ్వశాంతి మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను సద్గురు అచలానందస్వామి ఆశీస్సులతో పీఠాధిపతులు శ్రీ విరజానందస్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములను దర్శించుకుని తరించారు. నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం శ్రీ గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణం కమనీయంగా నిర్వహిస్తారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.


అచలానందస్వామి ఆశ్రమంలో విద్యుద్దీపాలంకరణలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి


కాలజ్ఞానంలోని వాక్యాలు చెబుతున్న శ్రీ వెంకటాద్రిస్వామి


బ్రహ్మంగారి అత్తమ్మ ఊరు పెద్దకొమెర్ల వాసులు చీర, సారె తెచ్చిన దృశ్యం


బ్రహ్మంసాగర్‌లో..


ఇరుముడి సమర్పించేందుకు వచ్చిన మాలధారులు


శ్రీ వీరబ్రహ్మక్షేత్రంలో క్యూలైన్లలో బారులు దీరిన భక్తజనం

ప్రజలందరూ జగనన్ననే కోరుకుంటున్నారు

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : ప్రజలందరూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్ననే ఉండాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ క్రమం తప్పకుండా 1వ తేదీనే పెన్షన్ అందుతుందని, సంక్షేమ పథకాలు సజావుగా కొనసాగుతాయని భావించి ఓట్లు వేశారన్నారు. తన వల్ల ప్రతి ఇంటికి మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండని, నిజాయితీగా అడిగి దేశంలో జగనన్న ఓ కొత్త ట్రెండ్ తెచ్చారన్నారు. సీఎం ఏ కార్యక్రమం చేపట్టినా దాని వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే నిర్ణయం తీసుకుంటారన్నారు. నిర్ణయం తీసుకుంటే వెనకడుగు వేసే ప్రశ్నే లేదన్నారు. చంద్రబాబు ఎంతసేపూ జగన్‌ను తిట్టడం తప్పితే తనవల్ల ప్రజలకు ఏ మేలు జరిగిందో చెప్పలేదన్నారు. పోలింగు బూతుల వద్ద భారీగా ప్రజలు క్యూలో నిల్చోవడంతో చంద్రబాబుకు దిక్కు తోచడం లేదన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, టీడీపీ వర్గీయులు దాడులకు తెగబడ్డారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారటీలకు 72 శాతానికి పైగా సీట్లు ఇచ్చామని, వారంతా వైఎస్సార్‌సీపీకే పట్టం కడతారన్నారు. చంద్రబాబు గెలుస్తాననడానికి ఆయనకున్న బేస్ ఏమిటని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ చెబితే నమ్మడానికి ఆయన రాజకీయాలకు కొత్త కాదన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు చరిత్ర రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. 2014లో రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేశాడన్నారు. రూ. 2 వేల నిరుద్యోగ భృతి చెప్పి ఇవ్వలేదని, జాబు వస్తే జాబ్ వస్తుందని మోసం చేశాడన్నారు. చంద్రబాబు పచ్చ మీడియా ప్రచారం చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన ఉందన్నారు. పోలింగ్‌కు ముందు అదే పనిగా ఊదర కొట్టిన పచ్చ పత్రికలు పోలింగ్ మరుసటి రోజు నుంచి ఒక్క వార్త రాయలేదన్నారు. ఈ నెల 14 వరకు డీబీటీ పథకాల డబ్బు ఆపారని, ఇప్పుడు డ్వాక్రా, విద్యాదీవెన తదితర పథకాల డబ్బు జగనన్న బటన్ నొక్కి ఖాతాల్లో వేశారన్నారు. చంద్రబాబు ఇచ్చేవాడా? అని ప్రశ్నించారు. ప్రజలు జగనన్నను నమ్మారని, ఆయనే కావాలనుకునే భారీగా వచ్చి ఓట్లు వేశారని, గతానికన్నా ఎక్కువ సీట్లు వస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాల ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న తొగటవీరక్షత్రియ సేవా సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతిభ గల తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు శ్రీ చౌడేశ్వరిదేవి తొగటవీరక్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తెలిపారు. స్థానిక తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం 12వ వార్షిక ప్రతిభా పురస్కారాల ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 480 పైగా మార్కులు సాధించిన, స్థానిక ఇంటర్ కళాశాలల్లో చదివి అన్ని గ్రూపుల్లో 80 శాతం పైగా మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థిని, విద్యార్థులకు ఇంగ్లిషు, తెలుగు మీడియంలో ప్రథమ బహుమతిగా రూ.3500, ద్వితీయ బహుమతిగా రూ.2500, తృతీయ బహుమతిగా రూ.2000 అందిస్తామన్నారు. 10వ తరగతిలో ప్రైవేటు పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటో బహుకరిస్తామన్నారు. అలాగే పాలిటెక్నిక్ చదువుతున్న పేద ప్రతిభావంతులైన తొగట విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. అర్హులైన తొగటవీర క్షత్రియ విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపల తమ దరఖాస్తులను తొగటవీర క్షత్రియకల్యాణ మండపంలో అందివ్వాలని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9849203829కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రగురామయ్య, సంఘం ఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, సభ్యులు బొలిశెట్టి వెంకట రామయ్య, కుండా నాగరాజు, హరి పాల్గొన్నారు.

సంయమనం పాటించండి


ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు, తర్వాత కూడా టీడీపీ నాయకులు వారి అధినాయకుడి ప్రోత్సాహంతో గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను రెచ్చగొట్టే ధోరణితో దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ అప్రమత్తంగా ఉండి సంయమనం పాటించాలని కోరారు. ఎన్నికల్లో పోలీసుల పాత్ర మెచ్చుకోదగిందని, సాధ్యమైనంత వరకు నిష్పక్షపాతంగానే పోలీసులు వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రజల మనసుల్లో మనం స్థానం సంపాదించాలని ఎదుటి పార్టీ వారిని దూషించడం కానీ, దాడులు చేయడం కానీ మన సిద్ధాంతం కాదని తెలిపారు. ఎంత రెచ్చగొట్టినా, ఏం చేసినా సాధ్యమైనంత వరకు ఓర్పు వహించాలని, చట్టం తన పని తాను చేసుకెళుతుందని పేర్కొన్నారు. దాడులకు తెగబడిన వారిపై పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఓర్పుతో ఉండాలని కోరారు.

23న దేవుని మాన్యం కౌలుకు వేలం

గోపవరం : మండలంలోని రాచాయపేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి హక్కుభుక్తం కలిగిన భూములను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు రాచాయపేటలో కౌలుకు వేలంపాట నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ బద్వేలు ఈవో సి.శివయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా వెయ్యి రూపాయలు డిపాజిట్ రూపంలో చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరానికి సంబంధించిన కౌలుగుత్త చెల్లించాలన్నారు. అలా చెల్లించని యెడల ఆ భూములను తిరిగి వేలం వేయనున్నట్లు తెలిపారు. గతంలో భూములు కౌలుకు తీసుకున్న వారు పాత బకాయిలు ఉన్నట్లయితే అలాంటి వారు పాటలో పాల్గొనకూడదన్నారు. రాచాయపేటలోని సర్వే నంబర్ 360లో 2.79 ఎకరాలు, బెడుసుపల్లెలో సర్వేనంబర్ 108లో 0.81 సెంట్లు, అలాగే చెన్నవరంలో సర్వేనంబర్ 223/1 లో 0.52 సెంట్లు, రాచాయపేటలో సర్వే నంబర్ 494లో 0.54 సెంట్లు, 550 సర్వేనంబరులో 1.46 ఎకరాలు, 559 సర్వేనంబరులో 1.10 ఎకరాలు, ఎస్.రామాపురం సర్వేనంబర్ 1595లో 0.41 సెంట్లు, టీ.సంగ్రపల్లె సర్వేనంబర్ 927/2లో 0.23 సెంట్లు, రామాపురం సర్వేనంబర్ 1454/1లో 0.62 సెంట్లు సోమేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి భూములు ఉన్నాయి. ఈ భూములు కౌలు వేలానికి సంబంధించి పాట దక్కించుకున్న వారు మూడేళ్ల కాలవ్యవధి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

సమస్యలు సృష్టించకండి

దువ్వూరు : సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్ పోల్ సంఘటనలను దృష్టిలో పెట్టుకుని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎవరైనా గొడవలు పెట్టుకుంటే వారిపైన నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి రౌడీషీట్ ఓపెన్ చేసి పట్టణ, మండల, జిల్లా నుంచి బహిష్కరిస్తామని దువ్వూరు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎవరైనా సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే పోస్టులు చేసిన వారిపైన, సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. మండలంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సమన్వయం పాటించి గొడవలకు పాల్పడవద్దని, ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్‌ఐ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీజీ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ ప్రొద్దుటూరు సబ్‌స్టేషన్, 33 కేవీ ఐడీఏ ఫీడర్, 33 కేవీ మార్కెట్ యార్డు ఫీడర్, 33 కేవీ ప్రొద్దుటూరు టౌన్ ఫీడర్, పలు 11 కేవీ ఫీడర్ల పరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ నిర్వహణ పనుల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రాజుపాళెం మండలంలో..

రాజుపాళెం : మండల పరిధిలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

4 గంటల పాటు..

మైదుకూరు : మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో శనివారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మైదుకూరు ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరులోని 220/33 కేవీ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మైదుకూరు, ఖాజీపేట మండల పరిధిలోని అర్బన్, రూరల్ ప్రాంత ప్రజలు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

వ్యాయామంతో రక్తపోటు నివారణ


బద్వేలు అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


ప్రొద్దుటూరు క్రైం : మహిళకు రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : నిత్యం వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి తగ్గడంతోపాటు రక్తపోటు రాకుండా నివారించవచ్చని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా పెద్దశెట్టిపల్లెలో రక్తపోటు నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ×రక్తపోటును కొలవండి.. దానిని నియంత్రించండి¶ అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గుండె పోటు, మూత్రపిండాల వ్యాధులకు రక్తపోటు ప్రధాన కారణమన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలితోపాటు వ్యాయామం చేయడం, బీపీని అదుపులో పెట్టుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, చంద్రశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాములపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో..

శ్రీరాములపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో బీపీపై డాక్టర్ భరత్ నారాయణ అవగాహన సదస్సు నిర్వహించారు. శరీరంలో రక్తప్రసరణ సరిగా లేకపోతే హెచ్చు తగ్గుల వల్ల బీపీ వస్తుందన్నారు. షుగర్ కంటే బీపీ ప్రమాదకరమని చెప్పారు. బీపీ ఉన్నట్టుండి పెరిగినా తగ్గినా రెండూ ఇబ్బందికరమన్నారు. 30–35 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ బీపీ గురించి తెలుసుకొని తగు నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న జీవనసరళి కారణంగా బీపీ రోగుల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


చాపాడు : బీపీ రోగులను పరిశీలిస్తున్న వైద్యాధికారి కావ్యమాధురి

జాగ్రత్తలు పాటించాలి

చాపాడు : అధిక రక్తపోటు పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, హై బీపీని తక్కువ అంచనా వేయరాదని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కావ్యమాధురి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతోపాటు ప్రజలకు హై బీపీ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హై బీపీ ఉండేవారు నిర్లక్ష్యంగా ఉండరాదని, నిర్లక్ష్యం చేస్తే ఒక్కో సారి ప్రాణానికే ప్రమాదం తలెత్తుతుందన్నారు. తలనొప్పి, ఛాతిలో నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం, వికారం, వాంతులు, దృష్టి మసకబారడం, ఆందోళనగా ఉండటం, చెవులలో శబ్దాలు వంటివి ఉంటే హై బీపీకి సూచనలన్నారు. హై బీపీ తగ్గాలంటే ఆహారంలో ఉప్పు, కారం తగ్గించుకోవాలని, మద్యపానం, ధూమ పానంను ఆపేయాలన్నారు.

అశ్రద్ధ చేస్తే ప్రమాదం

బద్వేలు అర్బన్ : అధిక రక్తపోటును అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జోత్స్నస్వర్ణలత పేర్కొన్నారు. తొట్టిగారిపల్లెలో అధిక రక్తపోటు వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఊబకాయం, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వంటి కారణాలతో హైబీపీ వస్తుందని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్ఓ చంద్రావతి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.